

# కాలమ్ దాటని కబుర్లు

బలభద్రపాత్రుని రమణి



## నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

### తోడూ - నీడా

**మా అమ్మమ్మగారి తల్లి** మా దగ్గరే ఉండేవారు. ఆవిడ్ని మా పెద్దనాన్నా వాళ్ళు ఇంకో అమ్మ అనేవారు (ఆవిడ చెల్లెలి కొడుకులు) మేము 'నాయినీ' అనేవాళ్ళం! నాయనమ్మకి షార్ట్ ఫార్మ్ అన్నమాట. నాయినీ పేరు సీతామాలక్ష్మి. నాయినీ ఒక్క పరుషమైన మాట మాట్లాడేదికాదు. ఎవర్నీ కష్టపెట్టేదికాదు. మా ఇంట్లో మా అమ్మకి ఆర్.టి.సీ వాళ్ళు ఇచ్చిన క్వార్టర్‌లోనే ఉండేది. ఎందుకంటే మరి ఆవిడ కూతురు మా అమ్మమ్మ. మా ఇంట్లో మా దగ్గర ఉండేది కదా! సో ఇప్పుడు ఇంట్లో మూడు తరాల అమ్మలూ, మూడు తరాల పిల్లలూ ముచ్చటగా ఉండేవాళ్ళం.

ఈ నాయినీని ఒకసారి చిన్ననాటి స్నేహితుడు గోపాలం చూడడానికొచ్చాడు. అప్పటికి ఈ సీతామాలక్ష్మికి ఎనభై ఉంటే ఆ గోపాలానికి ఇంకో రెండు ఏళ్ళు ఎక్కువే ఉన్నాయి. ఇద్దరూ చిన్ననాటి కబుర్లు చెప్పుకున్నారు ఆ రోజంతా. అప్పట్లో మంచి జ్ఞాపక శక్తులుండేవి. మా ఇంట్లో నేనిప్పుడు 5గంటలకి బయటకి వెళ్ళాలంటే అలారం పెడ్తున్నా. ప్లంబర్‌ని పిలవమంటే మా ఆయన ఫోన్‌బుక్ ఓపెన్ చేసి అతని పేరు గుర్తుకురాక రకరకాల పేర్లకి రాంగ్ నెంబర్లు చేస్తుంటారు. అలాంటిది.. అనప్పిండి వాళ్ళ సుందరం... దగ్గర్నుండి రైలు కట్టపై వీధిలో ఉండే రాంభట్ల వారి బుచ్చమ్మ వరకూ అన్ని ఇంటి పేర్లతో, ఆ వ్యక్తుల గురించి వాళ్ళు సులభంగా నిన్న చూసినట్లే మాట్లాడేసుకునేవారు.

తీరా గోపాలం వెళ్ళే సమయానికి, గోపాలం కూర్చున్న గొయ్యిలాంటి పడక కుర్చీలోంచి లేవలేకపోయాడు పాపం. మా నాయినీ చెక్క కుర్చీలోంచి లేచి "గోపాలం నా చెయ్యి అందించనా?" అంది.

గోపాలం ఇంక లేచే ప్రయత్నం చెయ్యక ఆ చెయ్యి అందుకున్నాడు.

హా రొమేంటిక్?

ఈవిడ గోపాలాన్ని గేట్ దాకా తీసుకెళ్ళి దిగబెట్టి, అక్కడే కాసేపు నిలబడి మాట్లాడి లోపలికి వచ్చింది.

మా అన్నయ్యల్లో సిసింద్రీ ఒకడు "నాయినీ ఈ గోపాలాన్ని చేసుకున్నా మాకు ముత్తాత ఉండేవాడు. ఫోటోలు కూడా సరిగ్గా లేవు మీ ఆయనవి.." అని హాస్యమాడాడు.

మా నాయనీ సిగ్గుగా "ఊర్కోరా ఏం మాటలూ?" అంది.

ఎనభయ్యోపడిలో కూడా ఆ సిగ్గు నేను స్వయంగా చూడగలిగాను.

ఇదంతా ఎందుకు చెప్పుకొచ్చానంటే, నన్ను మొన్న ఒక సంస్థ వాళ్ళు చీఫ్ గెస్ట్‌గా పిలిచారు. ఆ సంస్థ పేరు 'తోడూ నీడా'. ఆ ఫౌండర్ నందుల మోహినీ రాజేశ్వరిగారు. ఈ ఆర్గనైజేషన్ యాభై దాటిన సింగిల్స్ కోసం పెట్టారు. సింగిల్స్ అంటే భార్యా లేదా భర్తా పోయినవాళ్ళు కానీ, లేదా పార్ట్‌నర్‌చే విడిచి పెట్టబడిన వాళ్ళు కానీ అయి ఉండాలి. పెళ్ళిళ్ళు చేసుకోకపోయినా ఇక్కడ కమ్యూనిటీ లివింగ్‌లో సింగిల్‌గా ఉన్నవాళ్ళు కూడా హాయిగా ఆనందంగా కాలం గడపొచ్చు

కానీ ఇందులో చాలా సాదక బాధకాలున్నాయని రాజేశ్వరిగారు చెప్పారు. ఒకాయన వచ్చి సభ్యత్వం కోరాడుట.

"మీరు సింగిలేనా?" అంటే,



రాజేశ్వరిగారితో

"ఔను" అన్నాడట.

"భార్యకు విడాకులిచ్చారా? కాలం చేసారా?"

"రెండుకాదు."

"మరి?"

"ఆవిడ కొడుకు దగ్గర ఉంటుంది. నాకు లివింగ్ కంపేనియన్ కావాలి" అన్నాడుట.

"అలా టెంపరరీ వైఫ్స్ దొరకరు అబ్బాయ్" అని ఆ డెబ్భై ఏళ్ళ కుర్రాడికి చెప్పి పంపేటప్పటికి తల ప్రాణం తోకకి వచ్చిందట.

ఒక జంట - ఆయనకి అరవై ఆరు.. ఆవిడకి యాభై ఐదు. పిల్లలు ఒప్పుకోకపోతే వాళ్ళ పెళ్ళికి, ఇంట్లోంచి పారిపోయి వచ్చేసి పెళ్ళిచేసుకున్నారు. వినడానికే టీనేజ్ లవ్‌స్టోరీలా అద్భుతంగా ఉంది. ఇది నిజంగా జరిగింది.


కమీషనర్ రాజగోపాల్ పరిమిగారితో తోడూ-నీడా సంస్థలో

నేను సినిమాకి ఈ ప్లాట్ తీసుకుని కథ రాస్తే, "మనవలు వాళ్ళకి హెల్ప్ చేసినట్లు కూడా" రాస్తాను.

మరొక తెలుగురాని, నార్త్ ఇండియన్ కపూర్‌గారు, తెలుగు తప్ప అక్షరం ముక్క హిందీరాని శుద్ధ బ్రాహ్మలావిడ్ని పెళ్ళి చేసుకున్నారు. ఆయనకి అరవై పైనే ఉన్నాయి. ఆవిడకీ దాదాపుగా అంతే. ఆయనకి ఓ కూతురు ఉంది. ఈవిడకి పిల్లలు లేరు. ఆ అమ్మాయి దగ్గరుండి వీళ్ళ పెళ్ళి చేసింది.

ఆయనకి పెళ్ళికి ముందు నాన్‌వెజ్ తినడం, స్మోక్ చెయ్యడం, చపాతీలే తినడం అలవాటు. కానీ ఈవిడతో పెళ్ళయ్యాకా, ఈవిడ ఇంట్లో మగవాళ్ళూ, పొగా ఇంతకు ముందు అలవాటు లేదు పాపం అని స్మోకింగ్ మానేసారు. ఆవిడ శుద్ధ వెజిటేరియన్ కాబట్టి నాన్‌వెజ్ మానేసారు. "మరి రొట్టెలు ఎందుకు మానేసావూ? " అని కూతురు అడిగితే "ఆవిడ దగ్గర కూర్చుని గుజ్జుగా నెయ్యి వేసి అన్నం కలిపి పెడ్తుంటే, తినడం సులభంగా, రుచిగా అనిపించి రొట్టెలు మానేసానని" జవాబు ఇచ్చారుట.

చూసారా? ప్రేమున్న చోట ఏదీ కష్టం అనిపించదు.

సరే.. భోజనం అలవాటు మారిందీ, మరి మాట్లాడుకోవడం? పోట్లాడుకోవడం? ఈవిడకి హిందీ, ఆయనకి తెలుగూరాదే? అదే ప్రశ్న నేను ఇందిరగార్ని అడిగితే ఆవిడ ముసిముసిగా నవ్వి "సైగలతో అర్థం అవుతుంది లెండి" అన్నారు.

ఇలా అరవయ్యో పడిలో కూడా ఆనందంగా ఇంకో లైఫ్ పార్టనర్‌ని చూసుకుని జీవితం శాపంలా కాకుండా స్వప్నంలా గడపొచ్చు అని చాలామంది నిరూపిస్తున్నారు.

అసలు ఇరవయి, ఇరవై ఆరూ సంవత్సరాల వయసున్నప్పుడు బోలెడు మంది బంధువులూ, స్నేహితులూ ఉంటారు. ఆ వయసులో కన్నా ఈ వయస్సులోనే కదా కంపానియన్స్ కావలసిందీ?

ఉదాహరణకి నాంపల్లిలో ఎగ్జిబిషన్ జరుగుతోంది. డబ్బులున్నా, ఓపికున్నా ఒంటరిగా వెళ్ళాలంటే విసుగ్గా ఉంటుంది. ఆ సమయంలో "నేనున్నానని... తోడుగా పలికే.. తోడొకరుండిన... అదే భాగ్యమూ.. అదే స్వర్గమూ" కాదా.


సంస్థ ఐదవ వార్షికోత్సవంలో రావికొండలరావుగారితో

బాగా స్థిరపడి, పిల్లలు అమెరికాలో ఉద్యోగాలు చేస్తూ, ఇక్కడ ఒంటరిగా ఉన్న తల్లీ, లేకా తండ్రీ ఉంటారు. కొడుకు ఫ్లాట్ టీ.వీ, ఐ ఫోన్, ఐపేడ్ అన్నీ పంపిస్తాడు. కానీ ఆయన ఒంటరిగా కూర్చుని టీ.వీ చూడడంలో ఎంత నరకం పడ్తాడో. విహార యాత్రలు కానీ, సినిమా కానీ మనం ఒక్కళ్ళం ఎందుకు వెళ్ళము? పక్కనున్న వాళ్ళతో కామెంట్ చెయ్యకపోతే చూడలేము కనుక. అలాంటప్పుడు ఈ వయసుపై బడ్డ వారికి కంపానియన్ ఎంత అవసరం.

ఓసారి గబ్బర్‌సింగ్ సినిమాకి మా మిత్రులు టికెట్స్ పంపారు. మా పిల్లలూ, నేనూ వెళ్ళాం. ఒక టికెట్ మిగిలిపోయింది. ఒక ముసలాయన (లావుగా పొడుగ్గా, ఎస్.వి.రంగారావుగారిలా, మా నాన్నగారి పోలికలతో) టికెట్స్ దొరక్క విచార వదనంతో తిరిగి వెళ్ళిపోవడం చూసాను. నాలో పితృప్రేమ పెల్లుబికి ఆయనకి ఈ టికెట్ ఇచ్చాను. ఆయన మా పక్కనే కూర్చున్నాడు. సినిమా ఆరంభం అయింది... కానీ నేను తెరవైపు తక్కువగా, ఆయన వైపు ఎక్కువగా చూస్తూ కూర్చున్నాను. ఆయన ప్రతి జోక్‌కీ ఎంత పెద్దగా చప్పట్లు కొట్టి నవ్వుతున్నారంటే... ముందూ.. వెనుకా కూడా డైలాగ్స్ వినిపించడం లేదు. మళ్ళీ నాతో ఆ డైలాగ్ చెప్తున్నారు. అంతలోనే కుర్చీలోంచి కింద పడిపోయి లేస్తున్నారు. ఇదంతా చూస్తుంటే నాకు. ఆయన ఇలా ఒక్కరూ కాకుండా తన అనే మనిషితో వచ్చి ఉంటే ఇంకా సంతోషించేవారు అని జాలిగా అనిపించింది.

పెళ్ళి సృష్టికార్యం కోసమేకాదు. ఒక స్నేహం కోసం కూడా. అమ్మా, నాన్నా, చెల్లి, తమ్ముడూ అన్నీ నేచురల్ సంబంధాలు.. రక్తం వల్ల వచ్చేవి.. భార్యలేదా భర్తా ఆర్టిఫిషియల్ సంబంధం.. ఒడంబడిక ద్వారా వచ్చేది. ఇది లైఫ్‌లాంగ్ ఉంటుంది. మిగిలినవి పోతాయేమో. విడిపోతాయేమో అన్న బెంగవుండదు. అవి దేవుడు గట్టిగా ఇచ్చిన బంధాలు. ఇది మనం ఏర్పరుచుకునేది, వదిలెయ్యాలంటే చట్టం, న్యాయం.. సమాజం కలగచేసుకుంటాయి. అందుకే ఈ బంధంలో ఇరుక్కోడానికి, బయటకి రాడానికీ కూడా చాలామంది భయపడ్తారు.

ఒకావిడ ఫారెన్ ట్రిప్‌కి వెళ్ళినప్పుడు అరవైదాటిన వయసులో కూడా చాలా ఏక్టివ్‌గా 'ఇమ్మిగ్రేషన్ ఫార్మ్స్' నింపడం, లగేజ్ చెకిన్ చెయ్యడం, చెక్ ఔట్ చెయ్యడ్ం, హోటల్ రూమ్స్‌లో ఫార్మాలిటీస్ అన్నీ తనే చేస్తూ ఉంటే, భర్త విశ్రాంతిగా బుక్ చదువుకుంటూ కూర్చోవడం చూసి, సహ ప్రయాణీకులు "ఏవండీ.. మీ భార్య మిమ్మల్ని ఎంత బాగా చూసుకుంటున్నారో? ఇన్నేళ్ళ నుండీ ఇంతగా సుఖపడ్తున్నారనమాట.. అదృష్టవంతులు" అన్నారట.

దానికి ఆయన "కొత్తగా పెళ్ళయిందికదా.. అదీ మురిపెం" అన్నారుట. వాళ్ళు షాక్ అయ్యారుట.

ఇది చెప్తూ ఆవిడ ఎంత మురిసిపోయారో.

ఇలా 'తోడూ నీడా' ద్వారా పెళ్ళయిన సీనియర్ సిటిజెన్స్, కొత్తగా వచ్చిన 'రెడీమేడ్' కోడళ్ళూ, కూతుళ్ళూ, అల్లుళ్ళూ, కొడుకులూ, మనవలతో ఎంతో ఆనందంగా ఉన్నారు.

వీళ్ళని ఓల్డ్ పీపుల్ అని కానీ, వృద్ధులు అని కానీ అనలేము. మొన్న దసరా సెలెబ్రేషన్స్‌కి తోడూ - నీడా' హోమ్‌కి నాతో బాటు నా స్నేహితురాలు దివ్యజ్యోతిని కూడా తీసుకెళ్ళాను.



సంస్థ సభ్యులతో నేను, దివ్యజ్యోతి

డెబ్బై ఎనిమిదేళ్ళ ప్రభాస్.. యాభై ఐదేళ్ళ తమన్నాతో "పచ్చబొట్టేసినా... పిల్లగాడా" అన్న పాటకి చేసిన డాన్స్ కానీ, ఇంకో జంట చేసిన 'సుందరి నీ వంటి దివ్య స్వరూపం' అన్న డాన్స్ కానీ ఈ కాలం పిల్లలు చెయ్యలేరు. ఆ స్టెప్పులూ.... ఉత్సాహం అన్నీ రాజేశ్వరి గారి కృషీశీలతకీ, క్రమశిక్షణకీ నిదర్శనం.

ఓ రిటైర్డ్ కమీషనర్‌గారికి (అరవై ఏళ్ళు) అప్పుడే పెళ్ళి కుదిరింది. స్వీట్ బాక్స్‌తో వచ్చారు. చిన్నప్పుడు చేసుకుందాం అనుకున్న మరదలు, ఇప్పుడు ఆవిడా విడో అయి, పిల్లాడు అమెరికాలో సెటిలయ్యాడు. ఈయన భార్యపోయాక వెళ్ళి పెళ్ళి చేసుకుంటానంటే, ఆవిడ అన్నదమ్ములు ఒప్పుకోలేదు. ఇప్పటివరకూ కుటుంబంలో ఇలా ఈ వయసులో చేసుకున్న రెండో పెళ్ళిళ్ళు లేవు అని.

ఆవిడ అమెరికా వెళ్ళి కొడుకుని ఒప్పించుకుంది. ఇప్పుడు డిసెంబర్ 6 న పెళ్ళి.

ఆ రోజు ఆయన దాండియా, బతకమ్మ ఆటా మహా ఉత్సాహంగా ఆడారు.

పెళ్ళి చేసుకోగానే సరికాదండోయ్... ఆరోగ్యాన్ని బాగా 'ఫిట్' గా ఉంచుకోవాలి.

ఒకాయన చైన్ స్మోకరట. ఇలాగే ఒంటరితనం భరించలేక తోడూ - నీడా లో నమోదు చేసుకుని ఇంకో పెళ్ళి చేసుకున్నారు. ఆవిడా డైవోర్సీనే.

కానీ ఆయనకి సిగరెట్ వెలిగించబోతే 'పెద్దబొట్టు'తో ఇంట్లో తిరుగుతున్న ఈవిడ మొహం గుర్తొచ్చి, "కనీసం ఇంకో పది పదిహేనేళ్ళు ఆవిడ పసుపూ, బొట్టూ పెట్టుకుని తిరగాలి" అన్న సంకల్పంతో సిగరెట్ మానేసారుట.

ఎంత మంచి మార్పు కదూ?

ఇవన్నీ మనం పాత ఆలోచనలతో ఉన్నవాళ్ళతో అంటే "ఛీ ఛీ కొడుకులూ, అల్లుళ్ళూ మనవల ముందు మళ్ళీ పెళ్ళి చేసుకుని తగుదునమ్మా అని ఛెంగున తిరగడమా? సిగ్గుచేటు" అనచ్చు.

కానీ ఓసారి ఆలోచిస్తే, భర్తపోగానే భార్యని అదే పాడె మీద కాల్చద్దు అన్నప్పుడూ, వీరేశలింగమో, రాజారామ మోహనరాయో వచ్చి పసిపిల్లలకి పెళ్ళిళ్ళు చెయ్యవద్దనీ, భర్త పోతే గుండు చేయించద్దనీ, గురజాడగారు ఆడపిల్లల్ని, మగపిల్లల పెళ్ళి కోసం అమ్మొద్దు అన్నప్పుడూ.. ఇలాగే బుగ్గలు నొక్కుకుని ఉంటారు.

కానీ మార్పు వచ్చింది. మనిషి ఆలోచించకపోతే ఇంకా మనం 'నిప్పు' కనిపెట్టకుండా, 'చక్రం' కనిపెట్టకుండా అలాగే చర్మాలు కట్టుకుని, పచ్చి జంతువుల్ని పీక్కుతింటూ, 'అహం... ఒహం..' అని బల్లేలతో పొడుచుకుంటూ ఉండేవాళ్ళం.

చక్రం కనిపెట్టాక, తోపుడు బండినుండి, ఇంజన్, ఆ తర్వాత గాల్లోకి ఎగరడందాకా మనిషి కనిపెట్టాడు.

మన మనవల ఆ తరువాతి తరంలో "మా గ్రాండ్ పేరెంట్స్ చాలా ప్రిమిటివ్.. ఫోన్ నెంబర్లు చేత్తో నొక్కుకుని, చెవుల దగ్గర పెట్టుకుని వినేవాళ్ళు" అని నవ్వుకుంటారు. ఆ పాటికి గూగుల్ గ్లాసెస్ వచ్చి, ఇంకా కంటికి కనిపించని చిప్స్ ఏ చెవి వెనుకో ఫిక్స్

చేసుకుని, కంప్యూటర్‌లో ఆఫీసు పని చేసుకుంటూనో, శూన్యంలోకి చూసి అవతల ప్లానెట్ వాళ్ళతో సంభాషిస్తూనో కోడ్స్ ద్వారా తిరుగుతుంటారు. ప్రగతి ఎక్కడా ఆగదు. అది అనంతం.

హెడ్‌ఫోన్స్ పెట్టుకుని పెద్దగా నవ్వుతూ, మాట్లాడుతూ వెళ్తున్న టీనేజ్ పిల్లల్ని, కొంతమంది పెద్దవాళ్ళు జాలిగా చూసి "ఎక్కువ చదువుకుంటే ఇట్టాగే మతి చలించుద్ది" అనుకోవడం నేను విన్నాను.

అసలు నన్ను అడిగితే మనిషికి ఒక తోడు అన్నివేళలా అవసరం. అనారోగ్యంగా ఉన్నప్పుడే కాదు, ఆరోగ్యంగా ఉన్నప్పుడూ... మాట్లాడుకోడానికే కాదు పోట్లాడుకోడానికీనూ. అసలు రెండోది లేకుండా లైఫ్‌లో 'స్పైస్' ఏవుంటుంది?

ఓసారి మా ఆయన "డార్జిలింగ్ వెళితే బావుంటుంది" అన్నారు.

"డార్జిలింగ్‌లో పచ్చి మిరపకాయ బజ్జీలు దొరుకుతాయా?" అన్నాను.

"దొరికినా నువ్వు తినకూడదు, ఆయిలీ ఫుడ్స్ ఎవాయిడ్ చెయ్యాలి.. అసలే నీకు ఎసిడిటీ.." అన్నారు.

"చల్లగా ఉంటుందిగా.. వేడి వేడి మిర్చీలు తింటాను" అన్నాను.

"తినద్దు" అన్నారు.

"తింటాను" అన్నాను.

పోట్లాటలోకి దిగింది. మా పెద్దాడు "దేనికి పోట్లాడుకుంటున్నారు?" అన్నాడు.

"డార్జిలింగ్‌లో మిర్చీ బజ్జీ తినద్దు అంటున్నారు మీ నాన్న" అన్నాను.

"దానికి డార్జిలింగ్ ఎందుకు? మన సందు చివర కెళ్తే చాలు తినచ్చు" అన్నారు మావారు.

"డార్జిలింగ్ ఎప్పుడు వెళ్తున్నారు?" మా అబ్బాయి అడిగాడు.

"రిటైరయ్యాకా" అన్నారు మా వారు.

"ఎప్పుడు రిటైర్ అవుతున్నారు?"

"ఇంకో ఐదేళ్ళ తర్వాత" అన్నారు.

వాడు నవ్వేసి "ఎంజాయ్" అని వెళ్ళి పోయాడు. ఇలా జీవితంలో మనం పోట్లాడుకోవడం కూడా ఒక భాగమేగా? ఏవంటారు?

అడవిలో సుందరమైన తటాకాలూ, అందమైన పుష్పాలూ, రుచికరమైన ఫలాలు, క్రూరజంతువులు లేని సాధుజంతువులూ, రంగురంగుల పక్షులూ.. అన్నీ ఇచ్చి పర్ణశాలలో హంసతూలికా తల్పం ఏర్పరిచి మనని ఒంటరిగా వదిలేస్తే ఎంతకాలం ఉండగలం? ఎన్నున్నా మాట్లాడుకోడానికి ఓ మనిషి తోడు కోసం దిక్కులు చూస్తాం. దిగాలు పడ్తాం. సరే ఆ భగవంతుడు మన కోరిక తీర్చి ఒక మనిషిని పంపాడు.. మనం ఆనందంగా కబుర్లాడుకుంటాం.. మళ్ళీ కొంతకాలానికి దిగాలు పడ్తాం.. దిక్కులు చూస్తాం. ఇంకో మనిషి కోసం... ఎందుకూ? .. వాడి గురించి నేరాలు చెప్పుకోడానికి, వాడు పక్కకెళ్ళినప్పుడు... కాదంటారా?

ఇలా తోడు గురించి నన్ను రాయమంటే బోలెడన్ని ఉపమానాలు రాసుకుంటూ పోగలను.. కానీ ఈ నెల నేను నాకున్న సామాజిక స్పృహతో 'తోడూ - నీడా' గురించి మీకు చెప్పాలనుకున్నాను.

Romance is the essence of life… రొమేన్స్‌ని మించిన సామాజిక స్పృహ ఏవుంది? ఆధ్యాత్మికం ఎంత అవసరమో..... మనిషి మనుగడకి శృంగారం అంత అవసరం. ఫిజికల్ టచ్ లేకుండా కూడా కేవలం శృంగార పూరితమైన చూపులతో, భావాలతో, కమ్యూనికేషన్ ఏర్పరచుకుని కూడా లైఫ్‌స్పాన్ పెంచుకోగలరు అని సైంటిఫిక్ రీసెర్చ్‌ద్వారా తేలింది. (మా నాన్నగారు గుత్తివంకాయకూర గుండెకి మంచిదని అమెరికా సైంటిస్టులు చెప్పారు అనేవారు. ఎందుకంటే ఆయనకి ఇష్టం.)

ఇప్పుడు తోడూ నీడా ద్వారా సెకండ్ ఇన్నింగ్స్‌కి రెడీ అయిన ఈ జంటలు మళ్ళీ ఓ వసంతం చూసి, ఇంకో పాతికేళ్ళు ఆరోగ్యంగా ఆనందంగా గడిపెయ్యగలరని నాకు అనిపిస్తోంది. ప్రతికొత్త ఆలోచనా అది పుట్టినప్పుడు `విప్లవం`గానూ, తర్వాత సర్వసాధారణం అయిపోవడం మనకి తెలుసు.

ఈ మధ్య `కంచె` అనే సినిమా ద్వారా క్రిష్ అనే డైరెక్టర్ `హీరో` అంటే హెలీకాప్టర్‌లోంచి దూకి, టాటా సుమోలు పతంగుల్లా ఎగరేసి, సముద్రంలోంచి బయటకొచ్చి, భూమిని బద్దలు చేసి మెరుపుల్లో సిగరెట్ ముట్టించి ఇంట్రడక్షన్ చేసుకుని రానక్కర్లేదని, ఓ మంచి సినిమా, సాధారణమైన కుర్రాడి అసాధారణ యుద్ధం చూపించి తెలుగు ప్రేక్షకుల స్థాయిని పెంచాడు. ఇదో విప్లవం.

ఇది రొటీన్ ఫార్ములా మాస్ సినిమా కథల మీద యుద్ధం.. శాంతియుతమైన విజయకేతనం. అని నేను రివ్యూ రాసాను. ఈ కథ ఏ పెద్ద హీరో ఒప్పుకుని ఉండడు. అందుకే ఈ చిన్నపిల్లాడు చేసి పెద్ద పేరు తెచ్చుకున్నాడు.

ముక్తాయింపుగా www.thoduneeda.org అని కొడితే మా రాజేశ్వరిగారు చేస్తున్న మంచి ప్రయత్నం గురించి మీరు వివరంగా తెలుసుకోగలరు.ఇక ఒంటరిగా ఉన్నవాళ్ళు ``చేతిలో చెయ్యేసి చెప్పు బావా` అనే దసరా బుల్లోడు సినిమాలోని పాటలాగా జంటలైపోవాలి.

COMMENTS




